వేసవి భత్యం అందేనా?

ఉపాధి కూలీలకు వేసవిలో ప్రత్యేకంగా అందించే భత్యం అమలుపై ఎలాంటి స్పష్టత లేకపోవడంతో వారు ఆందోళన చెందుతున్నారు. గడిచిన మూడేళ్లుగా వేసవి భత్యం రాకపోవడం..ఇప్పటి వరకు ప్రభుత్వం నుంచి ఎలాంటి మార్గ దర్శకాలు అందపోవడంతో వేసవి భత్యంపై సందిగ్ధం నెలకొంది. దీనికి తోడు ఉపాధి పనులు చేపట్టే ప్రదేశాల్లో కనీస సౌకర్యాలు లేక కూలీలు ఇబ్బందులు పడుతున్నారు.

ఉపాధి పనులు చేస్తున్న కూలీలు



సీతారామపురం :గ్రామీణ ప్రాంతాల్లో వలసల నివారణ కోసం కేంద్ర ప్రభుత్వం మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని అమలు చేస్తోంది. సాధారణంగా పల్లెల్లో వ్యవసాయ పనులు పూర్తయిన తర్వాత ఏటా ఫిబ్రవరి నుంచి జూన్ వరకు ఉపాధి పనులు జోరుగా సాగుతుంటాయి. గతంలో వేసవిలో ఎండలకు ఉపాధి కూలీలు ఉపాధిహామీ పనులు చేయలేని పరిస్థితుల్లో వారిని ప్రోత్సహించేందుకు వేసవి భత్యం అమలు చేసేవారు. ఫిబ్రవరిలో 20 శాతం, మార్చిలో 25 శాతం, మేలో 30 శాతం, జూన్‌లో 25 శాతం అదనంగా వేతనాన్ని కూలీలకు అందించే వారు. అయితే ఈ ఏడాది ఏప్రిల్ వచ్చినా ఇప్పటి వరకు వేసవి భత్యంపై ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పష్టత లేకపోవడంతో కూలీలు ఆందోళన చెందున్నారు. ఉపాధి హామీ పథకం ప్రారంభమైనప్పటి నుంచి టీసీఎస్ సాఫ్ట్‌వేర్‌లోనే కార్యకలాపాలు కొనసాగుతూ వచ్చాయి. అయితే 2021 నవంబర్‌లో నూతనంగా ఎన్‌ఐసీ సాఫ్ట్‌వేర్‌ను తీసుకొచ్చారు. అందులో వేసవి భత్యానికి సంబంధించి ఎలాంటి ఆప్షన్ ఇవ్వలేదు. అప్పట్నుంచి మూడేళ్లుగా వేసవి భత్యాన్ని అమలు చేయడం లేదు. ఈ ఏడాది కూడా వేసవి భత్యంపై ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పష్టత లేకపోవడంతో అమలుపై వేతన దారుల్లో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

ఉపాధి కూలీల ఆవేదన

జిల్లాలోని 37 మండలాల్లో 2.78 లక్షల జాబ్ కార్డులు ఉండగా 4.38 లక్షల మంది వేతనదారులు ఉన్నారు. అందులో రోజుకు సుమారు లక్ష మంది వరకు ఉపాధి హామీ పనులకు వెళుతుంటారు. అలాగే ఉదయగిరి నియోజకవర్గంలోని 8 మండలాల్లో 68,650 జాబ్ కార్డులు ఉండగా, 1,14,081 మంది కూలీలుగా నమోదై ఉన్నారు. వీరిలో ప్రతిరోజూ 20వేల మందికి పైగా ఉపాధి పనులకు వెళుతుంటారు. వేసవిలో గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ పనులు అంతంత మాత్రంగా ఉంటాయి. ఈ తరుణంలో కూలీలు ఉపాధి పనులపై ఆధారపడి జీవనం సాగిస్తుంటారు. గతంలో కేంద్ర ప్రభుత్వం ఏటా వేసవిలో ఉపాధి కూలీల వేతనాలను రూ.20 నుంచి రూ.30 వరకు పెంచేది. ఈ ఏడాది ఏప్రిల్ ఒకటి నుంచి స్వల్పంగా రూ.7ను మాత్రమే పెంచింది. ఏప్రిల్ నుంచి ఉపాధి కూలీలకు రూ.307 చొప్పున వేతనం అందజేయనున్నారు. సాధారణంగా వేసవిలో ఎండల తీవ్రతకు కూలీలకు ఎక్కువగా పనిచేయలేరు. భూమి సైతం గట్టిగా ఉండి పనిముందుకు సాగదు. కూలీలు ఎక్కువగా శ్రమపడాల్సిన పరిస్థితి ఉంటుంది. అందుకనుగుణంగా వేసవిలో కూలీలను ప్రోత్సహించేందుకు గతంలో వేసవి భత్యాన్ని అందించే వారు. గత మూడేళ్లుగా వేసవి భత్యాన్ని ఇవ్వడం లేదు. ఈ ఏడాది వేతనాన్ని సల్పంగా పెంచడం, భత్యాన్ని అమలు చేయకపోవడంతో కూలీలు తమ కుటుంబాలను ఎలా పోషించుకోవాలని ఆవేదన చెందుతున్నారు.

కనీస వసతులు కరువు

ఉపాధి హామీ పనులు జరిగే ప్రదేశాల్లో కూలీలకు కనీస వసతులు కరువయ్యాయి. వేసవిలో ఉపాధి పనులు చేసే కూలీలు వడదెబ్బకు గురయ్యే ప్రమాదం ఉంది. ఉపాధి పనులు జరిగే చోట కూలీలు సేదతీరేందుకు నీడ, తాగునీటి సౌకర్యం కల్పించాలి. తాగునీటి వసతి కల్పించకపోతే రూ.5 అదనంగా భత్యం చెల్లించాలి. పని ప్రదేశంలో ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచాలి. పని చేస్తున్న సమయంలో కూలీలకు గాయాలైతే చికిత్స అందించేందుకు ప్రథమ చికిత్స కిట్లు కూడా అందుబాటులో ఉంచాలి. అయితే ఉపాధి పనులు జరిగే ప్రదేశాల్లో ఎక్కడా సౌకర్యాలు కనిపించడం లేదు.

ఉదయగిరి నియోజకవర్గంలోని ఉపాధి కూలీల వివరాలు

మండలం	జాబ్‌కార్డుల సంఖ్య	కూలీల సంఖ్య
ఉదయగిరి	8,523	13,122
దుత్తలూరు	6,184	9,532
వరికుంటపాడు	7,405	12,122
వింజమూరు	8,432	12,787
కలిగిరి	10,143	16,241
కొండాపురం	9,319	15,489
జలదంకి	7,500	11,963
సీతారామపురం	6,144	10,225

వేసవి భత్యం అందించాలి



గతంలో వేసవిలో ఉపాధి పనులు చేసే వారికి అదనపు కూలి వచ్చేది. నాలుగేళ్లుగా ఆ ఊసే లేదు. వేసవిలో భూమి గట్టిగా ఉండి పనులు చేసేందుకు కష్టంగా ఉంటుంది. పైగా ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటుంది. ఇలాంటి సమయంలో కొలతల ప్రకారం పనులు చేయలేం. వేసవి భత్యం అందించి ఉపాధి కూలీలను ఆదుకోవాలి.

– సుబ్బరాయుడు, ఉపాధి కూలీ, పడమటి రొంపిదొడ్ల

వసతులు కల్పించాలి



వేసవిలో ఉపాధి పనులు చేసే చోట ఎక్కడా కూడా కూలీలకు సౌకర్యాలు కల్పించడం లేదు. పని ప్రదేశంలో సేదతీరేందుకు ఎలాంటి టెంట్లు ఏర్పాటు చేయడం లేదు. దీంతో ఎండలకు కూలీలు ఇబ్బందులు పడుతున్నారు. గతంలో మజ్జిగ, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందజేసేవారు. ఇప్పుడు అవి కూడా ఇవ్వడం లేదు. అధికారులు స్పందించి పని ప్రదేశంలో కూలీలకు సౌకర్యాలు కల్పించేలా చర్యలు తీసుకోవాలి.

– కోడె రమణయ్య, సీపీఎం ప్రాంతీయ కార్యదర్శి, ఉదయగిరి

ఎలాంటి మార్గదర్శకాలు లేవు



ఉపాధి కూలీలకు వేసవి భత్యం గురించి ఎలాంటి మార్గదర్శకాలు లేవు. 2021 నవంబర్‌లో టీసీఎస్ సాఫ్ట్‌వేర్ నుంచి ఎన్‌ఐసీ సాఫ్ట్‌వేర్‌కు ఉపాధి కార్యక్రమాలు మారాాయి. అప్పటి నుంచి వేసవి భత్యం లేదు. పని ప్రదేశంలో టెంట్లు ఏర్పాటు చేయాలని, మెడికల్ కిట్లు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని ఫీల్డ్ అసిస్టెంట్లు, మేట్లను ఆదేశించాం. ఎండల తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో ఉపాధి కూలీలు వడదెబ్బకు గురికాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి.

–మృదుల, ఏపీడీ, ఉదయగిరి

క్లుప్తంగా

పొగాకు బ్యారెన్ దగ్ధం



దుత్తలూరు: మండలంలోని ఏరుకొల్లులో శుక్రవారం ప్రమాదవశాత్తు పొగాకు బ్యారెన్ దగ్ధమైంది. గ్రామానికి చెందిన దేవరపాటి వెంకట సుబ్బారెడ్డి పొగాకు బ్యారెన్‌లో పొగాకు క్యూరింగ్ చేస్తుండగా, ఆకులు గొట్టాలపై పడడంతో మంటలు చెలరేగాయి. దీంతో బ్యారెన్‌లోని గొట్టాలు, కర్ర, పొగాకు పూర్తిగా కాలిపోయాయి. ఉదయగిరి అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేశారు. ఈ ప్రమాదంలో సుమారు రూ.4 లక్షల మేర ఆస్తి నష్టం వాటిల్లినట్లు బాధిత రైతు వాపోయాడు.

కిలో పొగాకు గరిష్ట ధర రూ. 281

కలిగిరి: స్థానిక పొగాకు వేలం కేంద్రంలో శుక్రవారం కిలో పొగాకుకు గరిష్ట ధర రూ. 281 లభించింది. జనరల్ క్లస్టర్‌కు చెందిన రైతులు 430 బేళ్లను అమ్మకానికి తీసుకురాగా, 263 బేళ్లను కొనుగోలు చేశారు. వివిధ కారణాలతో 167 బేళ్లను కొనుగోలుకు తిరస్కరించారు. వేలంలో కిలో పొగాకు గరిష్ఠంగా రూ. 281, కనిష్ఠంగా రూ. 230, సరాసరిన రూ.265.78 ధర పలికిందని వేలం నిర్వహణాధికారి వీ మహేష్‌కుమార్ తెలిపారు. వేలంలో పది కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం పరిశీలన



సంగం: స్థానిక సొసైటీలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎఫ్‌సీఐ క్వాలిటీ కంట్రోల్ అధికారి నారాయణస్వామి శుక్రవారం పరిశీలించారు. కొనుగోలు కేంద్రంలోని ధాన్యం తేమ శాతాన్ని కొలిచే పరికరం, ధాన్యం కొనుగోళ్లకు సంబంధించిన రికార్డులను తనిఖీ చేశారు. ఎంత మేర ధాన్యం కొనుగోలు చేశారని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ధాన్యాన్ని దళారులకు అమ్ముకుని నష్టపోకుండా కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఎంఈఓ-1గా అనంతలక్ష్మి



ఆత్మకూరు: ఆత్మకూరు ఎంఈఓ-1గా సీహెచ్‌ఎం అనంతలక్ష్మి నియమితులయ్యారు. ఈ మేరకు విద్యాశాఖ రీజనల్ జాయింట్ డైరెక్టర్ కార్యాలయం నుంచి ఉత్తర్వులు అందడంతో శుక్రవారం ఆమె బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్న ఏఎస్‌పేట ఎంఈఓ ఎం జ్యోతి బాధ్యతలు అప్పగించారు. కాగా ఆత్మకూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్‌ఎంగా విధులు నిర్వహిస్తూ ఎంఈఓగా బాధ్యతలు చేపట్టిన అనంతలక్ష్మికి ఎంఈఓ-2 చలపతి, ఉపాధ్యాయులు మధుసూదన్‌శాస్త్రి, పలువురు ఉపాధ్యాయినులు అభినందనలు తెలిపారు.

చలివేంద్రం ప్రారంభం



అల్లూరు: స్థానిక బస్టాండ్ సెంటర్‌లో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని శుక్రవారం ప్రారంభించారు. మండల వ్యవసాయాధికారి వెంకటేశ్వర్లు తొలిరోజు మజ్జిగ పంపిణీ చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు చలివేంద్రాన్ని ప్రారంభించినట్లు తెలియజేశారు. ఎరువులు, పురుగు మందుల డీలర్ల అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

మద్యం దుకాణంలో తనిఖీలు

సీతారామపురం : సీతారామపురంలోని రెండు మద్యం దుకాణాలను ఉదయగిరి ఎక్సైజ్ సీఐ లక్ష్మణ్‌స్వామి శుక్రవారం తనిఖీ చేశారు. స్టాక్ రిజిష్టర్లను పరిశీలించి నిల్వలను తనిఖీ చేశారు. సమయాన్ని పాటిస్తూ ఎమ్మార్పీ ధరలకే మద్యాన్ని విక్రయించాలని సూచించారు. గ్రామాల్లో బెల్ట్‌షాపులు నిర్వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట ఉదయగిరి ఎక్సైజ్ సిబ్బంది ఉన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

వింజమూరు(ఉదయగిరి): స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశాన్ని శనివారం ఉదయం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ కే శ్రీనివాసరెడ్డి శుక్రవారం తెలిపారు. మండలాధికారులతో పాటు ప్రజాప్రతినిధులు తప్పక హాజరుకావాలని కోరారు.

టీకాలు తప్పనిసరి

వరికుంటపాడు: చిన్నారులకు వ్యాధినిరోధక టీకాలను తప్పనిసరిగా వేయించాలని వరికుంటపాడు పీహెచ్‌సీ సీహెచ్‌ఓ రాజశేఖరరాజు సూచించారు. శుక్రవారం ఆయన భోగ్యంవారిపల్లిలో టీకాల కార్యక్రమాన్ని తనిఖీ చేశారు. ఆరోగ్య,ఆశా కార్యకర్తలకు సూచనలు చేశారు.

చెరువు ఆక్రమణపై ఆర్డీఓ విచారణ

వింజమూరు(ఉదయగిరి): వింజమూరు మండలం కాటేపల్లి చెరువు ఆక్రమణపై కావలి ఆర్డీఓ వంశీకృష్ణ శుక్రవారం సాయంత్రం విచారణ జరిపారు. ఇటీవల కొందరు గ్రామస్తులు చెరువు ఆక్రమణపై ప్రజాసమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కావలి ఆర్డీఓ గ్రామానికి చేరుకుని ఫిర్యాదుదారులతో మాట్లాడి ఆక్రమించిన వారి వివరాలను అడిగి తెలుసుకున్నారు. వర్షం కురుస్తుండడంతో ఆక్రమణలను ఆర్డీఓ పరిశీలించలేకపోయారు. రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు సంయుక్తంగా ఆక్రమణలను సర్వే చేసి రెండ్రోజుల్లో తనకు నివేదికను అందజేయాలని ఆదేశించారు. ఆయన వెంట ఇరిగేషన్ ఎస్ఈ దేశ్‌నాయక్, డీఈ రామారావు, డీటీ చేవూరి శ్రీనివాసులు, తదితరులు ఉన్నారు.



గ్రామస్తులతో మాట్లాడుతున్న ఆర్డీఓ వంశీకృష్ణ

వివాదాస్పద శ్మశాన దారి పరిశీలన

సీతారామపురం : మండలంలోని నారాయణప్పపేట ఎస్సీ కాలనీకి సంబంధించిన శ్మశాన వాటికకు వెళ్లే వివాదాస్పద దారిని తహసీల్దార్ పీవీ కృష్ణారెడ్డి శుక్రవారం పరిశీలించారు. ఇటీవల దళితులు శ్మశానవాటిక దారి సమస్యను పరిష్కరించాలని ప్రజాసమస్యల పరిష్కార వేదికలో తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ మేరకు తహసీల్దార్ క్షేత్రస్థాయిలో వివాదాస్పద దారిని పరిశీలించారు. త్వరలో గ్రామసభ ఏర్పాటుచేసి ఇరువర్గాల అభిప్రాయాలను సేకరించి శ్మశాన వాటికకు దారి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతామని తెలిపారు. అప్పటి వరకు ఇరువర్గాల వారు సంయమనం పాటించాలని సూచించారు . దళిత నాయకులు కలివెల ఎలీషాకుమార్, మాలమహానాడు జిల్లా ఉపాధ్యక్షులు బొగ్గవరపు రత్నం, వీఆర్వో మనోహర్, సర్వేయర్ ప్రశాంత్, తదితరులు పాల్గొన్నారు.



దర్గాలో మౌలిక వసతులు కల్పించాలి

ఆత్మకూరు:పట్టణంలోని సుల్తాన్ షాహీద్ దర్గాలో మౌలిక వసతులను కల్పించాలని ముస్లింలు డిమాండ్ చేశారు. శుక్రవారం వారు దర్గా ఎదుట ఆవాజ్ కమిటీ సభ్యులతో కలిసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వక్ఫ్‌బోర్డు గత 12 ఏళ్లుగా దర్గా రూములకు సంబంధించి వసూలు చేస్తున్న ఆదాయ వివరాలను తెలియజేయాలని డిమాండ్ చేశారు. దర్గాను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు మరుగుదొడ్ల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని కోరారు. ముస్లింలకు షాదీ మంజిల్‌ను నిర్మించాలని, దర్గా ముజావర్‌తో పాటు స్వీపర్లకు పనికి తగిన వేతనం చెల్లించాలని కోరారు. ఎస్‌కే సందానీ, పి మస్తాన్, షేక్ ఖలీల్, ఖాజా రహంతుల్లా, రిజ్వాన్, సుల్తాన్‌బాషా, చాన్ బాషా, తదితరులు పాల్గొన్నారు.



శ్రీరామనవమిని ప్రశాంతంగా జరుపుకోవాలి

సంగం/అనుమసముద్రంపేట/మర్రిపాడు: శ్రీరామనవమి ఉత్సవాలను గ్రామీణ ప్రాంతాల్లో ఎలాంటి వివాదాలు లేకుండా ప్రశాంతంగా జరుపుకోవాలని సంగం సీఐ వేమారెడ్డి సూచించారు. శుక్రవారం సంగంలోని సర్కిల్ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఎస్పీ కృష్ణకాంత్, ఆత్మకూరు డీఎస్పీ కే వేణుగోపాల్ ఆదేశాలతో ఈ నెల 6న శ్రీరామనవమి పండగ సందర్భంగా ఉత్సవాల నిర్వాహకులకు సూచనలు చేశారు. ఉత్సవాల సందర్భంగా నిర్వహించే సాంస్కృతిక ప్రదర్శనలకు అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. అశ్లీల నృత్యాలను ప్రదర్శిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే శ్రీరామనమి ఉత్సవాల సందర్భంగా అశ్లీల నృత్యాలు, జూదాలు నిర్వహిస్తే ఉత్సవాల నిర్వాహకులపై కేసులు నమోదు చేస్తామని ఏఎస్‌పేట, మర్రిపాడు ఎస్సైలు ఏ సైదులు, శ్రీనివాసరావు వేర్వేరు ప్రకటనల్లో హెచ్చరించారు.

పీఎంశ్రీ నిధులను సద్వినియోగం చేసుకోండి

అనుమసముద్రంపేట: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు పీఎంశ్రీ ఫేస్-1 కింద మంజూరైన నిధులను సద్వినియోగం చేసుకోవాలని ఎంఈఓ-2 డీ సాయిప్రసాద్ హెచ్‌ఎం జీ హరికృష్ణకు సూచించారు. శుక్రవారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించారు. పీఎంశ్రీ నిధులతో చేపడుతున్న గ్రౌండ్ లెవలింగ్, కోర్టుల నిర్మాణ పనులను పరిశీలించారు.అనంతరం స్కౌట్స్ యూనిట్‌ను ప్రారంభించారు.

ఫైలేరియా బాధితులకు కిట్ల పంపిణీ

ఉదయగిరి/సీతారామపురం: ఉదయగిరి మండలం గండిపాళెం, సీతారామపురం పీహెచ్‌సీల్లో ఫైలేరియా బాధితులకు కిట్లను శుక్రవారం పంపిణీ చేశారు. గండిపాళెం పీహెచ్‌సీలో 20 మంది, సీతారామపురం పీహెచ్‌సీలో 14 మందికి ప్లాస్టిక్ టబ్, జగ్గు, టవళ్లు, సోప్, ఆయింట్‌మెంట్‌తో కూడిన కిట్లను ఉచితంగా అందజేశారు. ఉదయగిరి మలేరియా సబ్‌యూనిట్ అధికారి షేక్ గాజుల నౌషాద్‌బాబు, సిబ్బంది పాల్గొన్నారు.

డ్రైడేను విధిగా పాటించాలి

ఆత్మకూరు(చేజర్ల): చేజర్ల మండలంలోని చిత్తలూరు పీహెచ్‌సీ పరిధిలోని నూతక్కివారికండ్రిగలో శుక్రవారం డ్రైడే నిర్వహించారు. పీహెచ్‌సీ వైద్యులు నవీన్‌కుమార్ రెడ్డి, నరసింహరావు వైద్యసిబ్బందితో కలిసి ఇళ్లలోని నిల్వ నీటిని పారబోయించారు. జిల్లా మలేరియా నివారణాధికారిణి హుస్సేనమ్మ డ్రైడేను పరిశీలించి దోమలు వ్యాప్తి చెందకుండా ప్రతిఒక్కరూ వారానికి ఒకసారి డ్రైడేను పాటించాలని సూచించారు. దోమలతో వ్యాప్తి చెందే వ్యాధులపై అవగాహన కల్పించారు.

ఉపాధి ఏపీఓ బదిలీ

సీతారామపురం: మండల ఉపాధి హామీ పథకం ఏపీఓ సుభాషిణి వింజమూరుకు బదిలీ అయ్యారు. ఆమె స్థానంలో జలదంకి ఏపీఓగా పనిచేస్తున్న శ్యామలను నియమించినట్లు అధికారిక వర్గాల ద్వారా తెలిసింది.

చిన్నారికి ఆర్థిక సాయం

ఆత్మకూరు: పట్టణంలోని 13వ వార్డు అంబేద్కర్ కాలనీకి చెందిన ఏడేళ్ల చిన్నారి నాగజ్యోతికి సాంబశివ చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకుడు కంచి పరమేశ్వరరెడ్డి శుక్రవారం ఆర్థిక సాయం అందజేశారు. ఇటీవల నాగజ్యోతి తల్లిదండ్రులను కోల్పోయిన విషయాన్ని తెలుసుకున్న ఆయన బాలిక ఉజ్వల భవిష్యత్ కోసం నెలకు రూ.1000 చొప్పున ఏడాదికి రూ.12వేలు ఆర్థిక సాయం అందించేందుకు ముందుకొచ్చారు. ఆయన వెంట రాంపల్లి ప్రసాద్‌రెడ్డి, నరసింహరెడ్డి, తదితరులు ఉన్నారు.

హనుమంత వాహనం బహూకరణ



ఆత్మకూరురూరల్:మహిమలూరులోని కోదండరామస్వామి ఆలయానికి రామస్వామిపల్లి మాజీ సర్పంచ్ యర్రంరెడ్డి నాగమోహన్‌రెడ్డి, మహిత దంపతులు హనుమంత వాహనాన్ని శుక్రవారం బహూకరించారు. ఆలయ అర్చకులు హనుమంత వాహనానికి సంప్రోక్షణ కార్యక్రమాలు నిర్వహించారు. కాగా శ్రీరామనవమి ఉత్సవాల్లో భాగంగా విశేష పూజలు నిర్వహించారు.

జేవీవీ వైద్యశిబిరం రేపు

ఆత్మకూరు: పట్టణంలోని షిర్డీ సాయిరామ్ కళాశాల ఆవరణలో ఆదివారం ఉదయం 7 గంటల నుంచి వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు జనవిజ్ఞాన వేదిక నిర్వాహకులు శుక్రవారం తెలిపారు. నెల్లూరు జెట్టి శేషారెడ్డి విజ్ఞాన కేంద్రం సహకారంతో జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ప్రతి రెండు నెలలకు వైద్యశిబిరాన్ని నిర్వహిస్తున్నామని చెప్పారు. అందులో భాగంగా నిర్వహిస్తున్న వైద్యశిబిరంలో నెల్లూరు ప్రజావైద్యశాల డాక్టర్ ఎంవీ రమణయ్య, మెడికవర్ ఆస్పత్రి గుండె వైద్య నిపుణులు ఎం బాలకృష్ణ పాల్గొని రోగులకు సేవలు అందిస్తారని తెలిపారు. షుగర్ పరీక్షలను నిర్వహించి రెండు నెలలకు సరిపడా మందులను రూ.200కే అందజేయనున్నట్లు చెప్పారు. ఇన్సులిన్ బాటిల్‌ను రూ.80కే ఇవ్వనున్నట్లు తెలిపారు.

వింజమూరులో ఓ మోస్తరు వర్షం

వింజమూరు(ఉదయగిరి): వింజమూరు పరిసర ప్రాంతాల్లో శుక్రవారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో ఓ మోస్తరు వర్షం కురిసింది. ఉదయం నుంచి ఎండ తీవ్రత, ఉక్కపోతతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. సాయంత్రం వేళ వర్షంతో వాతావరణం చల్లబడంతో ఉపశమనం పొందారు.

రీసర్వేపై గ్రామసభ

అల్లూరు: సింగపేటలో రీసర్వేపై గ్రామసభను శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ రీసర్వే పైలెట్ ప్రాజెక్ట్‌లో భాగంగా సింగపేట గ్రామాన్ని ఎంచుకోవడం జరిగిందన్నారు. రీసర్వేను సజావుగా నిర్వహించేందుకు రైతులు సహకరించాలని కోరారు.

వైభవంగా గరుడ వాహన సేవ



మహిమలూరులో శేష వాహన సేవ



ఆత్మకూరులో గరుడ వాహన సేవ

ఆత్మకూరు: పట్టణంలోని సుందరమ్మ కోదండ రామాలయంలో జరుగుతున్న శ్రీరామనవమి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం రాత్రి గరుడ వాహనసేవను వైభవంగా నిర్వహించారు. సీతారాముల ఉత్సవమూర్తులను సుందరంగా అలంకరించి గరుడ వాహనంపై కొలువుదీర్చి గ్రామోత్సవం జరిపారు.

ఆత్మకూరురూరల్: శ్రీరామనవమి ఉత్సవాల్లో భాగంగా మహిమలూరులో యాదవరాజుల ఆధ్వర్యంలో శేష వాహన సేవను వైభవంగా నిర్వహించారు. అలాగే గండ్లవేడులో హనుమంత వాహన సేవను నేత్రపర్వంగా నిర్వహించారు. తూర్పువీధికి చెందిన వారు ఉభయకర్తలుగా వ్యవహరించారు.

రెవెన్యూ హెచ్చరిక బోర్డుల తొలగింపుపై ఫిర్యాదు

కొండాపురం: మండలంలోని మర్రిగుంటలో సర్వే నంబర్లు 219-26, 207, 281-1, 281-11లలోని 63.95 ఎకరాల ప్రభుత్వభూమిని అదే గ్రామానికి చెందిన ఇండ్ల చిన అంకయ్య ఆక్రమించి సాగు చేస్తున్న నేపథ్యంలో సర్పంచ్ దార్ల గోపీ ఫిర్యాదు మేరకు గత నెల 15వ తేదీన రెవెన్యూ అధికారులు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసి విషయం తెలిసిందే. అయితే ఆక్రమణదారుడు రెవెన్యూ హెచ్చరిక బోర్డులను తొలగించడంపై సర్పంచ్ కొండాపురం తహసీల్దార్ కోటేశ్వరరావుకు శుక్రవారం ఫిర్యాదు చేశారు. ఆక్రమణదారుడిపై తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ప్రభుత్వ భూమి ఆక్రమణదారుడిపై క్రిమినల్ కేసు నమోదు చేసిన పోలీసులు రాజకీయ అండ ఉండడంతో అరెస్ట్ చేయకపోవడంపై తప్పుబట్టారు. దీనిపై హైకోర్టులో కేసు వేశామని తెలిపారు. రెవెన్యూ అధికారులు హెచ్చరిక బోర్డులను తొలగించిన వ్యక్తిపై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.

నాసాకు వింజమూరు విద్యార్థుల ప్రాజెక్ట్



వింజమూరు: అమెరికాకు చెందిన నాసా సంస్థకు వింజమూరులోని శ్రీచైతన్య స్కూల్ విద్యార్థులు రూపొందించిన 'ఫ్యూచర్‌సిటీ' ప్రాజెక్ట్ ఎంపికైంది. అమెరికాకు చెందిన నాసా సంస్థ ప్రపంచ వ్యాప్తంగా 63 ప్రాజెక్ట్‌లను ఎంపిక చేయగా, అందులో వింజమూరు విద్యార్థులు హర్షిత్, వరుణతేజ్, అహ్మద్‌ఖాన్, గౌరీశ్రీ, హితశ్రీ, గణేష్‌కుమార్, లక్ష్మీనరసింహులు రూపొందించిన ప్రాజెక్ట్ చోటు దక్కించుకుంది. ఈ సందర్భంగా విద్యార్థులను ఉపాధ్యాయులు శుక్రవారం అభినందించారు.

రీసర్వేపై అవగాహన ర్యాలీ



ఆత్మకూరు(చేజర్ల): చేజర్ల మండలం చిత్తలూరులో రీసర్వేపై శుక్రవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ బీ మురళి మాట్లాడుతూ గ్రామంలోని భూములను రీసర్వే చేయనున్నట్లు తెలిపారు. రీసర్వేతో భూ సమస్యలకు పరిష్కారం లభిస్తుందన్నారు. రీసర్వేకు ప్రజలు సహకరించాలని కోరారు. వీఆర్వోలు, రెవెన్యూ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

సెల్‌టవర్ల నిర్మాణానికి స్థల పరిశీలన

సీతారామపురం: మండలంలోని దేవమ్మచెరువు, జయపురం, గుండుపల్లి, చింతోడు గ్రామాల్లో బీఎస్ఎన్ఎల్ సెల్ టవర్ల నిర్మాణానికి రెవెన్యూ అధికారులు శుక్రవారం స్థల పరిశీలన చేశారు. ఆయా గ్రామాల్లో అధికారులు పర్యటించి అనువైన ప్రదేశాలను గుర్తించారు. ఆర్ఐ శ్రీనివాసులు, వీఆర్వో బాలు, సర్వేయర్ ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఆశ్రమం ఆస్తుల జోలికొస్తే సహించం

ఉదయగిరి: మండలంలోని లింగాలదొనలో ఉన్న కాశీనాయన ఆశ్రమం ఆస్తుల జోలికి వస్తే సహించమని స్వామి శ్రీనివాసానంద శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కొందరు వ్యక్తులు ఆశ్రమ ఆస్తులపై కన్నేశారని, వారి కుట్రలను అందరూ ఎదుర్కోవాలని పిలుపునిచ్చారు. జ్యోతి క్షేత్రంలో జరిగిన ఘటన మరువక ముందే కొందరు వ్యక్తులు ఇలాంటి దుశ్చర్యలకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. అలాంటి వారిని అందరూ కలిసికట్టుగా ఉండి ప్రతిఘటించాలన్నారు.

వైభవంగా సీతారాముల కల్యాణం

వరికుంటపాడు: స్థానిక కోదండరామస్వామి ఆలయంలో నూతన సీతారాముల ఉత్సవ విగ్రహాలకు బుధవారం నుంచి నిర్వహిస్తున్న సంప్రోక్షణ ఉత్సవాలు శుక్రవారంతో ముగిశాయి. చివరి రోజు నూతన ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించి శాంతి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు.